క్లుప్తంగా

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి



పొన్నూరు: గుంటూరులో ఈ నెల 15వ తేదీ నుంచి 20 వరకు జరిగిన రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పొన్నూరు మండలంలోని దొప్పలపూడి జెడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి రేగులగడ్డ అజిత్ జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లెకోన సునీత లత తెలిపారు. డిసెంబర్‌లో ఛత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలలో ఆంధ్ర ప్రదేశ్ జట్టుకు అజిత్ ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అజిత్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ తన్నీరు శివరామయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు వెంకటకృష్ణాపురంలో బజరంగ్ నేత్రజ్యోతి



అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపర కొనసాగిస్తూ నేత్ర జ్యోతి పేరుతో అంధత్వ సమస్య నివారణకు గ్రామీణ ప్రాంతాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. పెదకాకాని మండలంలోని వెంకటకృష్ణాపురం,దేవరాయబొట్లవారిపాలెం గామాల్లో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నేత్రజ్యోతి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సంక్షేమ సారథి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో రైతులు, రైతు కూలీలు, వెనుకబడిన వర్గాలు, దళిత, గిరిజన బడుగు బలహీన వర్గాలు ఎక్కువగా ఉన్న గ్రామాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ శిబిరం ద్వారా కంటి సమస్య ఉందని గుర్తించిన వారికి 7 రోజుల్లోగా కళ్లజోళ్లు అందిస్తున్నట్లు అంబటి మురళీకృష్ణ తెలియజేశారు.

విజేతలకు బహుమతులు అందజేత



గుంటూరు రూరల్: పుస్తక పఠనం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని తద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అధ్యాపకులకు వివిధ రకాల క్రీడలు, పోటీలను నిర్వహించారు. బుక్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. బెస్ట్ లైబ్రరీ యూజర్స్‌కు బహుమతులు అందజేశారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'చలపతి' అధ్యాపకురాలికి డాక్టరేట్



రమాదేవి

గుంటూరు రూరల్: ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరినీ తమ కళాశాల అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తుందని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకురాలి అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన అధ్యాపకురాలు చప్పాల రమాదేవికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. ఆచార్య ఇ.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో కన్‌జెషన్ కంట్రోల్ మెకానిజమ్స్ ఇన్ ఐపీవీ-6 ద్యూటింగ్ ప్రోటోకాల్ ఫర్ లో పవర్ లాసి నెట్‌వర్క్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలిని చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్‌లు అభినందించారు.

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనే రావాలి

- పొన్నూరు, దొప్పలపూడిలలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు
- ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు వివరించిన నాయకులు, కార్యకర్తలు



దొప్పలపూడిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తున్నారని, రాష్ట్రంలో ప్రతి పేదవాడికి అందుతున్న సంక్షేమ పథకాలు తిరిగి కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్ బాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని దొప్పలపూడి గ్రామ సచివాలయంలో నాలుగున్నర ఏళ్ల పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల బోర్డును నాయకులు ఆవిష్కరించారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, సర్పంచ్ కె.రమేష్, ఎంపీపీ భవనం పద్మలీల, ఎంపీడీఓ శ్రీనివాస రావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మనోహర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నూరు పట్టణంలో..

పొన్నూరు పట్టణంలోని 20, 22 వార్డు సచివాలయాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ పాల్గొని సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. జేసీఎస్ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు, నాయకులు బొద్దులూరి రంగారావు, గేరాకుమారి, గౌస్, వార్డు కన్వీనర్ పీరు సాహెబ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ద్వారానే సంక్షేమం, అభివృద్ధి ..

గుంటూరు రూరల్: మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని, జగనన్న ప్రభుత్వంలోనే జనమంతా బాగుంటారని గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మల సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తురకపాలెం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలతో నేడు జనమంతా సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. గడిచిన చంద్రబాబు పాలనలో 14 ఏళ్లు ప్రజలు మోసపోయారన్నారు. జగనన్న ద్వారానే ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముందుకే సంక్షేమ పథకాలు అందిస్తున్నాడన్నారు. నేరుగా మహిళల ఖాతాల్లో నగదు బదిలీ చేసి మహిళలను మహారాణులుగా తయారు చేశాడన్నారు. తురకపాలెం గ్రామంలో ఇప్పటివరకూ రూ.21 కోట్లు నేరుగా ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల రూపంలో అందాయన్నారు. గ్రామానికి అందించిన సంక్షేమ పథకాల బోర్డ్‌లను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామ సర్పంచ్ డబ్బూరి సూర్యప్రకాశరావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ దాసుపాలెం సర్పంచ్ ఎదురుపాక వెంకట్, ఉప సర్పంచ్ బోరుగడ్డ విల్సన్‌రాజు, మాజీ సర్పంచ్ పొన్నగంటి సాంబయ్య, పేరేచర్ల శివశంకర్, గ్రామ కన్వీనర్లు అబ్రహాం, గృహసారథులు మాజేటి శ్రీనివాసరావు, మెట్టు సీతారామిరెడ్డి, మెట్టు రామఅంజిరెడ్డి, పొన్నగంటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీరామ నగర్‌లో...

గుంటూరు రూరల్: రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని వైఎస్సార్ సీపీ అర్బన్ క్లస్టర్ 2 కన్వీనర్ బండారు శ్రీను తెలిపారు. మంగళవారం 46వ డివిజన్ పరిధిలోని శ్రీరామనగర్ 198 సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయంలో సచివాలయం పరిధిలో అందించిన సంక్షేమ పథకాల బోర్డ్‌ను ఆవిష్కరించారు. స్థానికంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వం జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. 41వ డివిజన్ కార్పొరేటర్ బి.స్మితపద్మజ, ఆర్అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరీ, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఉద్దగిరి మురళి, రాచకొండ ముత్యాలరాజు, బి.సుధాకర్‌రెడ్డి, కె.ప్రభాకర్‌రెడ్డి, వెంకట్, అరుణ్, యార్డ్ డైరెక్టర్ ఎం.లక్ష్మి, నోడల్ ఆఫీసర్ రంగారెడ్డి, వీఆర్‌ఓ కోకిలరావు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులున్నారు.



పొన్నూరు సచివాలయంలో సంక్షేమ బోర్డు ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు



సంక్షేమ పథకాల బోర్డ్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ ఇంటూరి పద్మావతి



శ్రీరామనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న క్లస్టర్-2 కన్వీనర్ బండారు శ్రీను తదితరులు

కులగణనపై విస్తృతంగా ప్రచారం చేయాలి

శిక్షణ అధికారి, తహసీల్దార్ గోపాలకృష్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న గోపాలకృష్ణ

పొన్నూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేను సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమర్థవంతంగా నిర్వహించాలని శిక్షణాధికారి, చేబ్రోలు తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి మండలంలో జరిగే కులగణనపై పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ కులగణన సర్వేతో ఇప్పటి వరకు అందుతున్న ప్రభుత్వ పథకాలకు ఇబ్బంది ఉండదన్నారు. ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం కలగదని పేర్కొన్నారు. అన్ని వివరాలు యాప్‌లో గోప్యంగా ఉంటాయన్నారు. ముఖ్యంగా సామాజిక, ఆర్థిక పరిస్థితులను సమతూకం చేసేందుకు ఈ కుల గణన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సర్వేలో ప్రతిఒక్కరూ వివరాలు అందజేయాలన్నారు. పుట్టిన పిల్లల నుంచి వృద్ధుల వరకు ఇవ్వాలన్నారు. కుల గణనతో అనేక మంది చేతివృత్తుల వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు, రుణాలు అందజేయడానికి ఉపకరిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదని వలంటీర్లకు సూచించారు. 27వ తేదీ వరకు గ్రామాల్లో తిరిగి కులగణనపై విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. సర్వే విధానాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్ పై వివరించారు. మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, టీపీఓ సాంబయ్య , ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కులగణన పక్కాగా నిర్వహించాలి..

పెదకాకాని: కులగణన సర్వే పక్కాగా ఉండాలని చేబ్రోలు ఎంపీడీఓ, కులగణన కార్యక్రమం మాస్టర్ ట్రైనర్ బాబూరావు అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో కులగణన సర్వేపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చేబ్రోలు ఎంపీడీఓ బాబూరావు మాట్లాడుతూ ఈ నెల 27 వ తేదీ నుంచి వారం రోజుల పాటు ప్రతి ఇంటికి సచివాలయం సిబ్బంది, వలంటీర్‌లు పర్యటించి కులగణన చేపట్టాలన్నారు. ప్రజలయొక్క సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, విద్యా పరమైన స్థాయిలు గుర్తించి తద్వారా అభివృద్ధికి సంబంధించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడానికి ఈ సర్వే ఉపకరిస్తుందన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, సూపరింటెండెంట్ బీవీ మల్లేశ్వరరావు, తహసీల్దార్ పి.రత్నం, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన సర్వేపై శిక్షణ తరగతులు..

గుంటూరు రూరల్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన సర్వేపై సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదినారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర కులగణన కార్యక్రమాన్ని ఈనెల 27వ తేదీనుంచి చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఈనెల 22వ తేదీన మండలంలోని లాలుపురం, చల్లావారిపాలెం, వెంగళాయపాలెం గ్రామాల్లోని సచివాలయం సిబ్బందికి, వలంటీర్లకు ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 2.30 గంటలనుంచి 4.30 గంటల వరకూ చిన్నపలకలూరు, జొన్నలగడ్డ, మల్లవరం, ఓబులునాయుడుపాలెం, తురకపాలెం గ్రామాల సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు.

ఫుట్‌బాల్‌లో సెయింట్ జోసఫ్స్ విద్యార్థుల సత్తా



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సిస్టర్ సంధ్యారాణి

పెదకాకాని: యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో పెదకాకాని సెయింట్ జోసఫ్స్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పెదకాకాని గ్రామంలోని సెయింట్ జోసఫ్స్ హైస్కూల్ విద్యార్థులను మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సంధ్యారాణి, కరస్పాండెంట్ రెజీనా మేరి అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ నుంచి 6వరకు న్యూఢిల్లీలోని ఎంకేసీఎస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్కూల్‌లో యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో మన రాష్ట్రం నుంచి పెదకాకాని సెయింట్ జోసఫ్స్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఫైనల్ అండర్-14 ఫుట్ బాల్ మ్యాచ్‌లో హర్యానా రాష్ట్ర విద్యార్థులతో పోటీ పడి విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత మెడల్స్‌తో పాటు కప్ అందజేశారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనపరచేలా విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దిన పీఈటీలు రాజమోహన్, రాజ్ కుమార్, ప్రవల్లికలను అభినందించారు. విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

'ఆర్‌వీఆర్‌జేసీ'లో కార్తిక మాసోత్సవాలు



ముగ్గుల పోటీలలో పాల్గొన్న విద్యార్థినులు

గుంటూరు రూరల్: పండుగలు భారతీయ సంస్కృతి సాంప్రదాయల ప్రతిరూపాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో కార్తిక మాసం పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తిక మాసాన్ని పురస్కరించుకొని భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలపై సజనాత్మకతను పెంపొందించేందుకు కళాశాల ఉమెన్స్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. తెలుగు సాంప్రదాయ పద్ధతిలో విద్యార్థినులు భారీ సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొని వివిధ రకాల పూల అలంకరణలతో, రంగులతో వేసిన ముగ్గులు దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థి దశలో నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు వారిలో నూతన ఆనందోత్సాహాన్ని నింపి, జీవితంలో మధుర జ్ఞాపకాలుగా నిలుస్తాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రోత్సాహక నగదు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. ఉమెన్స్ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ డాక్టర్ సుధావాణి పర్యవేక్షించారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



ఏసురాజు (ఫైల్)

గుంటూరు రూరల్: యువకుడు అదృశ్యమైన సంఘటనపై నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం హౌసింగ్ బోర్డ్ కాలనీ 2వ లైనుకు చెందిన చింతలచెరువు ఏసురాజు అలియాస్ రాజ్‌కుమార్ అనే యువకుడు ఇంట్లో చెప్పకుండా ఫోన్ ఇంట్లో పెట్టి గత నెల 28వ తేదీన ఇంటినుంచి బయటకు వెళ్లాడని తిరిగి రాలేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇతని స్వగ్రామం పల్నాడు జిల్లా లింగారావుపాలెం అని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో కానీ 8688831606, 7995824326 సెల్ నంబర్లలో తెలియజేయాలని తెలిపారు.

ఓటర్ల జాబితా సక్రమంగా ఉండాలి

ఆర్డీఓ శ్రీకర్



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు ఆర్డీఓ శ్రీకర్

పెదనందిపాడు: ఓటర్ల లిస్టు సవరణ చేసేటప్పుడు వాటిని సక్రమంగా చూడాలని, వాటికి సంబంధించిన రిజిస్టర్ మెయింటెన్ చేయాలని గుంటూరు ఆర్డీఓ శ్రీకర్ బీఎల్‌ఓలకు సుచించారు. మంగళవారం మధ్యాహ్నం పెదనందిపాడు ఎంపీడీఓ కార్యాలయంలో కాకుమాను, పెదనందిపాడు మండలాల బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆర్డీఓ శ్రీకర్ మాట్లాడుతూ యాడింగ్, డిలిట్, ఈపిక్రేషియో ఎన్ని చేశామనేది బీఎల్‌ఓలు వారికిచ్చిన రిజిస్టర్లలో రాసుకోవాలని, తద్వారా వారు ఎన్ని చేశారనేది పూర్తిగా అర్థమవుతుందని, ఎవరూ ఎటువంటి తప్పుడు సవరణలు చేయకుండా ఉండటానికి ఈ రిజిస్టర్ అవసరమవుతుందని ఆయన చెప్పారు. ఓటరు లిస్టులో ఆడవారు, మగవారు ఎంత మంది ఉన్నారు, ఎంత శాతం ఉన్నారు తదితర వివరాలన్ని నమోదు అవుతాయని వివరించారు. డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్(డీఎస్‌ఈ), ఫొటో సిమిలర్ ఎంట్రీస్ (పీఎస్‌ఈ)లు ఎలా చేయాలని వారికి పూర్తిగా వివరించారు. ఈ సమావేశంలో కాకుమాను పెదనందిపాడు తహసీల్దార్లు ప్రసాదరావు, సుభాని, రెండు మండలాల బీఎల్‌ఓలు తదితరులు హాజరయ్యారు.

తగిన అనుమతులతోనే ప్రైవేటు వెంచర్లు

- నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం
- నగర కమిషనర్ కీర్తి చేకూరి



వెంచర్‌కు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ప్రైవేట్ వెంచర్లు, లే అవుట్లు తగిన అనుమతులతోనే ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే పట్టణ ప్రణాళిక అధికారులు తొలగింపు చర్యలు తీసుకుంటారని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం వాసవి నగర్‌లో అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న లే అవుట్, శ్రీనగర్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన అపార్ట్మెంట్‌లను తనిఖీ చేసి తదుపరి అనుమతులపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వెంచర్లు అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, పట్టణ ప్రణాళిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంచర్ల రోడ్ వైడెనింగ్ పోర్షన్, అంతర్గత రోడ్ల వెడల్పు, ప్లాట్ల కొలతలు, మార్ట్ గేజ్ ప్లాట్లు, యుటిలిటీ ఏరియా, ఎమినిటీస్ ఏరియా, ఓపెన్ స్పేస్, గ్రీనరీ, డ్రైన్ల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకొని నేరుగా తనిఖీ చేశారు. అనంతరం పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే వెంచర్లకు అనుమతులు ఇవ్వాలని, తుది అనుమతుల కోసం తమకు పంపే ముందే ప్రణాళిక అధికారులు సదరు వెంచర్ లను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ నిర్దేశిత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల మేరకు లేని వెంచర్లకు అనుమతులు మంజూరు చేయబోమన్నారు. అనంతరం శ్రీనగర్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించి, మాట్లాడుతూ నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆటోనగర్ అభివృద్ధికి కృషి



పట్నంబజారు: ఆటోనగర్‌లో వ్యాపారుల సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. మంగళవారం ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ఆటోనగర్ ప్రాంతంలో వ్యాపారులు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యంగా సైడు కాల్వలు, రోడ్లు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసేదేలేదన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. స్థానిక కార్పొరేటర్ పఠాన్ రిహానా, డివిజన్ అధ్యక్షుడు నూర్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నేతలు సలీం, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై టీడీపీ కార్యకర్తల దౌర్జన్యం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో ఉండవల్లి సచివాలయం -2లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో అధికారులు మాట్లాడుతుండా టీడీపీ కార్యకర్తలు వచ్చి అధికారులను అడ్డుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే అర్జీ రూపంలో ఇస్తే సంబంధిత అధికారులకు తెలియజేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ వారి మాటలు పట్టించుకోకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే ఆర్కేను దూషిస్తూ అక్కడ ఉన్న వారిని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారు. అధికారులు ఎంత చెప్పినా వినకుండా వారిపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ రెచ్చిపోయారు. మా ప్రభుత్వం వస్తే మీ సంగతి తేలుస్తాం ఐదు నెలలు ఆగండి అంటూ అధికారులతో పాటు అక్కడకు వచ్చిన ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. పోలీసులు వచ్చి టీడీపీ కార్యకర్తలను అడ్డుకుని అక్కడి నుంచి తరలించారు.

తైక్వాండో చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: తైక్వాండో చాంపియన్‌షిప్‌లో స్టెమ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ భరత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విద్యానగర్‌లోని స్టెమ్ స్కూల్లో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో భరత్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 18,19వ తేదీల్లో తెనాలిలోని జేఎంజే కళాశాలలో జరిగిన 41వ సబ్ జూనియర్ ఆరో కాడిట్ ఇంటర్ జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్-23 బాలికల విభాగంలో ఎస్‌కే సన రజత పతకం, కాడిట్ బాలికల విభాగంలో సీహెచ్ తనీష, ఎం.అక్షర కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. అదేవిధంగా కాడిట్ బాలుర విభాగంలో పి.శశి నిఖిల్, షేక్ అబ్దుల్ లుక్మన్ కాంస్య పతకాలు పొందారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు కరాటే, తైక్వాండో సాధన చేయడం ఎంతో అవసరమన్నారు.